RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 96 | మార్చి 04, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# కృష్ణ జలాల్లో తెలంగాణకు అన్యాయం

## ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీళ్లు తీసుకుంటోందని కేంద్ర మంత్రికి ఫిర్యాదు

## కేంద్ర జల్‌శక్తిమంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ భేటీ




**వేద న్యూస్, డెస్క్:**

కృష్ణాజలాలు సహా గోదావరి ప్రాజెక్టులపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఢిల్లీలో చర్చలు జరిపారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి సీఆర్ పాటిల్‌తో రేవంత్‌రెడ్డి సమావేశం కాగా పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు భేటీ తర్వాత వెల్లడించారు. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని కేంద్ర మంత్రికి వివరించినట్లు ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీళ్లు తీసుకుంటోందని ఫిర్యాదు చేసామన్నారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకుని ఏపీ నీటి తరలింపును ఆపాలని కోరామన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి ఏపీ తీసుకునే 10 వేల క్యూసెక్కులను 5 వేల క్యూసెక్కులకు తగ్గించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. ముచ్చుమర్రి నుంచి కూడా తరలించకుండా ఆపుతామని చెప్పారన్న ఉత్తమ్ గోదావరిపై ఏపీ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయాన్ని కూడా కేంద్ర మంత్రికి వివరించామన్నారు. అయితే ఆ ప్రాజెక్టుకు సంబంధించి



తమకు ఎలాంటి ప్రతిపాదన, డీపీఆర్ రాలేదని కేంద్ర మంత్రి అన్నారని తెలిపారు. ఆ ప్రాజెక్టు వివరాలు వస్తే తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారని వివరించారు. తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలకు సంబంధించి ట్రైబ్యునల్-2లో విచారణ త్వరగా పూర్తిచేయాలని కోరామన్న ఉత్తమ్ పాలమూరు రంగారెడ్డి, సీతారామ సాగర్, సమ్మక్క సారక్క ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ ప్రాజెక్టులకు ఏఐబీపీ లేదా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి నిధులివ్వాలని కోరామన్నారు. మోనికుంట వాగు, చిన్నకాళేశ్వరం, ఛనాఖా-కొరటా ప్రాజెక్టులకు కూడా నిధులివ్వాలని కోరగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టుల్లో వెంటనే టెలీమెట్రీలు ఏర్పాటుచేయాలని కోరగా వెంటనే ప్రక్రియ చేపడుతామన్నారని చెప్పారు. కృష్ణా జలాల వినియోగంలో రోజువారీ జోక్యం చేసుకోడానికి, ట్రైబ్యునల్ విచారణ త్వరగా పూర్తి చేయడానికి ఒప్పుకున్నారని తెలిపారు. తెలంగాణలో నికర జలాల ఆధారంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కృష్ణా జలాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యను గోదావరిపైనా ఎదుర్కోడానికి తెలంగాణ సిద్ధంగా లేదని చెప్పారు. తెలంగాణలో గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదని తమకి కేటాయింపులు జరిగిన తరువాతే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కృష్ణా జలాల విషయంలో వచ్చిన సమస్యలే భవిష్యత్‌లో గోదావరి విషయంలో వస్తాయి. తెలంగాణ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్షకు 2 నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తాం..

## ఇంటర్ బోర్డ్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య

**వేద న్యూస్, హైదరాబాద్ :**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సుమారు పది లక్షల మంది విద్యార్థులు రాయనున్న ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. తొలిసారిగా హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీని సాయంతో ఎగ్జామ్ సెంటర్ ఎక్కడ ఉందో సులభంగా తెలుసుకోవచ్చు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 1532 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డ్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు. 29,992 మంది ఇన్విజిలేటర్లు, 72 ఫ్లయింగ్ స్క్వాడ్, 124 సిట్టింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రశ్నా పత్రాలు, ఆన్సర్ షీట్లు జిల్లా కేంద్రాలకు చేరాయని, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయం చేసుకుంటూ పరీక్షల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామాన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను ఇంటర్ బోర్డ్ వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు 8.45 వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరిన కృష్ణ ఆదిత్య ఒకటి, రెండు నిమిషాలు ఆలస్యమైన వారిని సైతం అనుమతిస్తామని స్పష్టం చేశారు.

2లో..

## ముగిసిన ఎస్జీటీల ఇండక్షన్ ట్రైనింగ్

మూడు రోజుల పాటు కొత్త టీచర్లకు శిక్షణ

# ఎమ్మెల్సీగా పింగిళి శ్రీపాల్ రెడ్డి

**వేదన్యూస్, నల్గొండ**

నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి విజయాన్ని అందుకొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఈ గెలుపు ఆయన సొంతమైంది. ఇక కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధించారు. మార్చి 27వ తేదీన తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీలకు ఎన్నికలు జరిగాయి.

వాటికి సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ మార్చి 3వ తేదీ ఉదయం ప్రారంభమైంది. వాటిలో ఒకటి వరంగల్, ఖమ్మం, నల్గొండకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఇక 2 ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అదే విధంగా.. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ గ్రాడ్యుయేట్ స్థానానికి సంబంధించిన ఎమ్మెల్సీ కౌంటింగ్ నిన్న జరిగింది. వీటిలో రెండు స్థానాల ఫలితాలు తేలిపోయాయి. వాటి విజేతలు ఎవరో స్పష్టత వచ్చేసింది. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే కౌంటింగ్ సైతం కొనసాగుతోంది. అందులో ప్రధానంగా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో తొలిసారి బీజేపీ బోణి కొట్టింది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందారు. కొమురయ్యకు 12,959 ఓట్లు పోలైయ్యాయి. ఇక 12081 ఓట్ల మ్యాజిక్




ఫిగర్‌ను కొమురయ్య అవలీలగా దాటారు.

ఇక ఈ ఎన్నికల బరిలో నిలిచిన వంగ మహేందర్ రెడ్డికి 7182, అశోక్ కుమార్‌కు 2621, కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు పోలైయ్యాయి. ఇక నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాలరెడ్డి విజయాన్ని అందుకొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండకు సంబంధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి గెలుపొందారు. ఆయన 11, 800 ఈ మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు.

# చట్టాలపై అవగాహన అవసరం : సీపీ అంబర్ కిషోర్ ఝా

**వేద న్యూస్, వరంగల్ :**



ప్రతి పౌరులు సహ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో సమాచార హక్కు రక్షణ చట్టం-2005 ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో సొసైటీ డైరీని సీపీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సహా చట్టం ప్రభుత్వ పనితీరులో పారదర్శకతనూ, జవాబుదారీతనాన్నీ ప్రోత్సహించి అవినీతి రహిత సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సహ చట్టాలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి కావాల్సిన సమాచారాన్ని నేరుగా దరఖాస్తుదారులే పొందవచ్చని, సమాచారం పొందడం రాజ్యాంగపరమైన హక్కు అని అన్నారు. సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు, మరియు సామాన్య ప్రజలకు సహ చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి కావాల్సిన సమాచారాన్ని అందించడంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో అవినీతి నిర్మూలనలో భాగస్వాములై నిరంతరం కృషి చేస్తున్న సహ చట్టం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఖాన్, హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యహి యా జాబురి, హనుమకొండ జిల్లా మీడియా కన్వీనర్ హలీం షరీఫ్, వరంగల్ జిల్లా లీగల్ అడ్వైజర్ షేక్ కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం ఏర్పడ్డాక జర్నలిస్టులకు

# మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది

## టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

**వేద న్యూస్, జనగామ :**

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు ఏ విధంగానైతే ఏకమై పోరాడారో అదే స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. సోమవారం జనగాం జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు మేలు కంటే కీడే ఎక్కువగా జరిగిందని, దాదాపు పదేళ్లు అధికారంలో కొనసాగిన గత టీఆర్ ఎస్-బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వాలతో పాటు కొన్ని జర్నలిస్టు సంఘాలు కూడా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నాయని, జర్నలిస్టుల పక్షాన ఉండాల్సిన సంఘాలు పాలకుల పక్షాన నిలిచి సమస్యలను పక్కన పెడుతున్నాయని ఆయన విమర్శించారు. ఒక యూనియన్ పదేళ్ల ప్రభుత్వానికి తొత్తుగా మారి జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఇంకొక యూనియన్ ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారి జర్నలిస్టులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి సంఘాలను నమ్మి జర్నలిస్టులు మోసపోతున్నారని, జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాపితంగా జర్నలిస్టులు సమస్యలపై సమిష్టిగా పోరాటాలకు

మిగతా 4వ పేజీలో..



## తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు..

విజయవాడ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో విద్యా, మున్సిపాల్టీలు, తెలుగు భాషాభివృద్ధి వంటి అంశాలపై కీలక విధాన నిర్ణయాలు ప్రకటించారు. ఇకపై అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్ అందించడంతో స్థానిక సంస్థలకు విద్యుత్ ఛార్జీల భారం తగ్గుతుందని అన్నారు. కేంద్రీకృత బిల్లుల చెల్లింపుల విధానం నుంచి మున్సిపాల్టీలకు విముక్తి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 2024 ఏప్రిల్ నెల నుంచి తమ బిల్లులను తామే చెల్లింపులు జరుపుకునేలా మున్సిపాల్టీలకు స్వేచ్ఛ నిస్తున్నట్లు తెలిపారు.క్యాపిటల్ ఎక్స్ పెడించర్ ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రత్యేక ప్రణాళికలు గురించి ప్రస్తావించారు. ప్రవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి నిర్ణయం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ప్రోత్సాహకంగా ప్రాజెక్టులో 20 శాతం మేర వయబులిటి గ్యాప్ ఫండింగ్ ఇచ్చేలా కూటమి ప్రభుత్వం స్కీం డిజైన్ చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టుల గ్యాప్ ఫండింగ్ స్కీం కోసం రూ.2 వేల కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారిగా తెలుగు భాషకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. తెలుగు భాషకు తామిచ్చే ప్రాధాన్యతను తెలియజేప్పేందుకే ఈ నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచారం కోసం బడ్జెట్టులో ప్రత్యేక కేటాయింపులు కూడా కేటాయించారు. నవోదయం 2.0 స్కీం కింద మద్యపాన, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం కోసం నిధుల కేటాయింపులు చేసినట్లు తెలిపారు. కాలుష్య రహిత ఆంధ్రగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపడుతున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పయ్యావుల ప్రస్తావించారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీరో కాలుష్యం ఉండేలా ప్రణాళికలు రూపకల్పనపై బడ్జెట్టులో ప్రస్తావించారు.

## అప్పులు చేశారు.. ఇప్పుడు తీరుస్తున్నాము

విజయవాడ : అప్పులు చేయడమే తప్పు.. అప్పులు తీర్చడాన్ని మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరి చేస్తున్నాం. వైసీపీ పాలనలో కాంట్రాక్టర్లే రాష్ట్ర ప్రభుత్వాన్ని బ్లాక్ లిస్టులో పెట్టారని పయ్యావుల ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరపకపోవడంతో అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు గత ప్రభుత్వంలో ముందుకు రాలేదు." అని అన్నారు.ఇజ్రాయెల్ టెక్నాలజీని రాష్ట్రానికి తెచ్చినప్పటి పరిస్థితులను బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పయ్యావుల గుర్తు చేసుకున్నారు. డ్రిప్ ఇరిగేషనుపై అధ్యయనానికి ఇజ్రాయెల్ వెళ్లిన బృందంలో తానూ సభ్యుడిగా ఉన్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబుకు గుర్తు చేశారు. "దేశంలో తొలిసారిగా ఉమ్మడి ఏపీలోనే డ్రిప్ ఇరిగేషన్ పైలెట్ ప్రాజక్టును అమలు చేశాం. జాతీయ స్థాయిలో డ్రిప్ ఇరిగేషనుపై వేసిన టాస్క్ ఫోర్సుకు చంద్రబాబే ఛైర్మనుగా ఉన్నారు. చంద్రబాబు ఇవాళ ఏం ఆలోచిస్తారో.. రేపు దేశం అదే ఆలోచిస్తుందనడానికి డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టే నిదర్శనం. ఇవాళ డ్రిప్ ఇరిగేషన్ లేని రాష్ట్రం లేదు, డ్రిప్ ఇరిగేషన్ లేని పొలం లేదు. ఇలాంటి కీలకమైన డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది." అని వెల్లడించారు.ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గురించి కూడా ప్రస్తావించారు. మంత్రి మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధిలో ముందడుగు వేస్తున్నాం. నాటి ప్రభుత్వ అరాచక విధానాలపై అమరావతి రైతులు పోరుబాటను ఎంచుకున్నారు. తమను తాము కాపాడుకుంటూ రాష్ట్ర రాజధానిని కూడా కాపాడుకునేలా అమరావతి రైతులు చేసిన పోరాటాన్ని మరువలేం. రాజధాని పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజనులా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. రాజధాని అమరావతి సెల్ఫ్ సస్టైనబుల్ ప్రాజెక్టు అని నిరూపితమైంది.

## ఫిలింనగర్ లో చికెన్ ఫ్రై, కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న వ్యాపారులు

హైదరాబాద్ : బర్డ్ ఫ్లై దెబ్బతో చికెన్ తినేవారి సంఖ్య తగ్గిపోవడంతో చికెన్ వ్యాపారులు ఢీలాపడ్డారు. నిపుణులు చికెన్ను 70 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించి తిన్నప్పుడు ఎటువంటి సమస్యలుండవని చెప్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వ్యాపారులు, ప్రముఖ చికెన్ పంపిణీ సంస్థల ప్రతినిధులు వినూత్న తరహా ప్రచారానికి దిగుతున్నారు. ఫిలింనగర్లోని జ్ఞాని జైల్ సింగనగర్ కరెంట్ ఆఫీస్ వద్ద 300 కేజీల చికెన్ ఫ్రై, 3 వేల కోడి గుడ్లను బస్తీవాసులకు, స్థానికులకు పంచి పెట్టారు. చికెన్ తినడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదని చికెన్, కోడిగుడ్లు ఆరోగ్యానికి మంచి ప్రోటీన్ ఆహారమని ఈ సందర్భంగా వారు అవగాహన కల్పించారు.

## చీరాల రైల్వే స్టేషన్ గేట్ ఎదురుగా వ్యక్తి మృతి

చీరాల : చీరాల రైల్వే స్టేషన్ ఎదురు సాయి కృష్ణ లాడ్జ్ గేటు వద్ద ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో చీరాల వన్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పట్టణంలోని నవాబుపేటకు చెందిన కోడూరి రవికుమార్ గా పోలీసులు గుర్తించారు. మృతికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని దర్యాప్తు అనంతరం పూర్తి విషయాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు

## శవంతో మల్లన్న సాగర్ ముంపు బాధితుల ధర్నా

సిద్దిపేట:గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ముందు శవంతో మల్లన్నసాగర్ ముంపు బాధితులు ధర్నాకు దిగారు. ముంపు గ్రామాల్లో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి స్థలం లేదంటూ ఆందోళన చేసారు. 14 గ్రామాల ప్రజలకు ఆరేళ్లుగా సమస్యగా మారిన చివరి మజిలీ స్థలం.ఓ వ్యక్తి చనిపోవడంతో ఎక్కడ అంత్యక్రియలు నిర్వహిం చాలో అధికారులే చెప్పాలని డీసీఎంలో మృతదేహాన్ని తీసుకువచ్చి ధర్నా చేసారు.

## ఘనంగా నూతి శ్రీకాంత్ జన్మదిన వేడుకలు

- అంకితభావం, చిత్తశుద్ధి ఆయన నిర్వర్తించిన కృషి ఎనలేనిది.
- సోషల్ మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

**వేద న్యూస్, హైదరాబాద్ :**



కాంగ్రెస్ నేత, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు నారాయణగూడ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సోషల్ మీడియా వాట్సప్ ట్విట్టర్ ల ద్వారా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు నారాయణగూడ లోని క్యాంపు కార్యాలయం కోలహలంతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు నారాయణగూడకు పార్టీ కార్యకర్తలు బారులు తీరడంతో మూడు రంగులమైంది. అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు జై శ్రీకాంత్ అన్న జై శ్రీకాంత్ అన్న అనే నినాదాలతో ఆ ప్రాంగణమంతా మార్మోగింది. పార్టీ శ్రేణులను పలకరిస్తూ నిరంతరాయంగా నిలబడి ఆయనతో ఫోటోలు దిగి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓబిసి స్టేట్ కోఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్ మాట్లాడుతూ అందరి గుండెల్లో ఎన్నటికీ చెరపలేని ముద్ర శ్రీకాంత్ అన్నా అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనోధైర్యమే శ్రీకాంత్ అన్నా అని చెప్పారు. అంబర్ పేట నియోజకవర్గం ప్రజలకు గుండె చప్పుడు శ్రీకాంత్ అని తెలిపారు.

# 3 సీట్ల కోసం 10 మంది పోటీ

వరంగల్ : తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు రేసు ఇంట్రెస్టింగ్‌గా మారింది. అసెంబ్లీలో సంఖ్యాబలం ఆధారంగా నాలుగు ఎమ్మెల్సీ సీట్లు కాంగ్రెస్‌కు దక్కే ఛాన్స్ ఉంది. వీటిలో ఒకటి మిత్రపక్షాలైన సీపీఐ లేదా ఎంఐఎంకు ఇవ్వాలని డిసైడ్ అయిందట కాంగ్రెస్ పార్టీ. ఇక మిగిలిన మూడు సీట్లకు పదుల సంఖ్యలో ఆశావహులు ఉన్నప్పటికీ..ఎవరికి ఛాన్స్ ఇవ్వాలనే దానిపై హస్తం పార్టీ పెద్దలు ఒక స్పష్టతకు వచ్చినట్లు టాక్ నడుస్తోంది.సామాజిక సమీకరణాల ఆధారంగా మూడు సీట్లను భర్తీ చేయబోతున్నారట. ఇందులో ఒకటి మాత్రం గన్ షాట్‌గా అద్దంకి దయాకర్‌కు దక్కనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అద్దంకి దయాకర్‌కు ఇప్పటికే రెండు, మూడు సార్లు అవకాశాలు మిస్ కావడంతో ఈ సారి ఆయనకు బెర్త్ పక్కా అన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సీటు దక్కకున్నా.. పార్లమెంట్ ఎన్నికల్లో సీటు రాకున్నా..ఆఖరికి ఒకసారి ఎమ్మెల్సీ ఛాన్స్ మిస్ అయినా..అద్దంకి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు. అందుకే ఈ సారి అద్దంకి దయాకర్‌కు ఎట్టి పరిస్థితిల్లో చాన్స్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి పట్టుబడుతున్నట్లు పార్టీ వర్గాల టాక్.ఇక రెండో ఎమ్మెల్సీ సీటును సీఎం రేవంత్ పొలిటికల్ అడ్వైజర్ వేం నరేందర్ రెడ్డికి దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వేం నరేందర్ రెడ్డి సీఎంకు పొలిటికల్ వ్యవహారాల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు కూడా వేంకు ఎమ్మెల్సీ సీటు కోసం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేశారు. ఈ సారి పార్టీ తరఫున అవకాశం ఉంది కాబట్టి వేం నరేందర్ రెడ్డికి ఇప్పించుకోవాలని చూస్తున్నారట. అయితే వేంను రాజ్యసభ పంపించాలని గతంలో భావించారు.ఆయన మాత్రం ఢిల్లీ వెళ్లేందుకు ఇంట్రెస్ట్ చూపడం లేదట. దీంతో వేం నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి స్టేట్ పాలిటిక్స్‌లో ఆయన సేవలను వాడుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. కాంగ్రెస్‌కు దక్కే మూడో సీటు కచ్చితంగా మహిళకే ఇవ్వాలని పార్టీ డిసైడ్ అయిందట. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన విజయా భాయి, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంకు చెందిన పారిజాత నర్సింహారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ బండ్రు శోభారాణి వంటి నేతలు ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు.కానీ ఎస్టీ సామాజికవర్గానికి చెందిన విజయా భాయి..రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పారిజాత నర్సింహారెడ్డిలో ఒకరికి చాన్స్ ఇవ్వొచ్చంటున్నారు. అయితే రాజ్యసభ సీట్లలో ఇప్పటికే మిగతా సామాజిక వర్గాలకు ఛాన్స్ ఇచ్చారు. దాంతో ఎమ్మెల్సీగా రెడ్డి సామాజికవర్గం నేతకు అవకాశం కల్పించాలని భావిస్తున్నారట. ఏదైనా అనివార్య కారణాలతో వేం నరేందర్‌రెడ్డికి చాన్స్ మిస్ అయితే పారిజాత నర్సింహారెడ్డికి బెర్త్ దక్కనుందంటున్నారు. అదే జరిగితే మరోసీటు బీసీ నేతకు దక్కవచ్చు. ఏదేమైనా మూడు ఎమ్మెల్సీల్లో ఒకటి అద్దంకి దయాకర్ పోగా మిగిలిన రెండింటిలో..వేం నరేందర్‌రెడ్డి, విజయా బాయ్, పారిజాత నర్సింహారెడ్డిలలో ఎవరికి అదృష్టం దక్కనుందనేది చర్చనీయాంశంగా మారింది.

**ఈ సారైనా పోటీ చేస్తారా**

తెలంగాణ మళ్లీ పొలిటికల్ హీట్ మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించింది ఎన్నికల సంఘం. దీంతో తెలంగాణలో ఐదు సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. అన్నింటినీ అధికార పార్టీ దక్కించుకుంటుందా? కారుకి ఏమైనా ఛాన్స్ ఇస్తుందా? ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎత్తులకు కేసీఆర్ చిత్తవుతారా? పొలిటికల్ సర్కిల్స్‌లో దీనిపై చర్చ జోరుగా సాగుతోంది.ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ చేశాయి. దీనికి కావల్సిన సంఖ్యా బలం బీజేపీ వద్ద లేదు. దీంతో అధికార కాంగ్రెస్ -బీఆర్ఎస్ మధ్య పోటీ షురూ అయ్యింది. ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీ ఎన్నిక కావడంతో అధికార పార్టీ నుంచి చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. తమకు తెలిసిన వారి ద్వారా లాబీయింగ్ చేసే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. తెలంగాణలో ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. వారిలో మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, మల్లేశం, మిర్జా రియాజుల్ హసన్ ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన మల్లేశం గతేడాది అధికార పార్టీలో చేరిపోయారు. ఇక రియాజుల్ హాసన్ మజ్లిస్ నేత. మిగిలిన వారంతా బీఆర్ఎస్‌కి చెందిన నేతలే ఉన్నారు.ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని ఒక్కసారి పరిశీలిస్తే.. అధిక సీట్లు అధికార కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకోనుంది. ఒక్క స్థానం ప్రతిపక్ష బీఆర్ఎస్ దక్కించుకునే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. తమ స్థానాన్ని తమకే ఇవ్వాలని మజ్లిస్ పట్టుబడితే ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇక ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి అధికార పార్టీ నుంచి పలువురు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. రెడ్డి సామాజికవర్గం నుంచి జీవన్‌రెడ్డి, జగ్గారెడ్డి, సామ రామ్మోహన్‌రెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమ కుమార్, ముదిరాజ్ సామాజికవర్గం నుంచి సునీతారావు పేరు ఉన్నాయి.

## నార్సింగి దగ్గర కొత్త ఎగ్జిట్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి ఓఆర్ఆర్‌ను నిర్మించారు. ఇప్పుడు ఔటర్ పైనా ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో రద్దీని తగ్గించడానికి హెచ్ఎండీఏ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఎగ్జిట్ పాయింట్‌ను నిర్మిస్తోంది.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. అటు ఓఆర్ఆర్ అవతల వెస్టర్న్ హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. ఈ కష్టాలను తగ్గించడానికి హెచ్ఎండీఏ కీలక నిర్ణయం తీసుకుంది. నానక్‌రామ్‌గూడ ఇంటర్ ఛేంజ్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించే ప్రయత్నం చేస్తోంది.వాహనాల రద్దీని తగ్గించడానికి కొత్త ఎగ్జిట్‌ను నిర్మిస్తున్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేసిన సూచనల ప్రకారం.. నానక్‌రామ్‌గూడ ఇంటర్ ఛేంజ్ దాటిన తర్వాత, నార్సింగి టోల్ ప్లాజా ముందు కొత్త ఎగ్జిట్‌ను నిర్మిస్తున్నారు. దీని నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయింది, మార్చిలో దీనిని ప్రారంభించాలని హెచ్ఎండీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.కొత్త ఎగ్జిట్ లక్ష్యం రద్దీని తగ్గించడం అని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా గచ్చిబౌలి నుండి నార్సింగి వరకు ఉన్న మార్గంలో.. నార్సింగి ఇంటర్ ఛేంజ్ రోటరీ దగ్గర తరచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. అటు కోకాపేట వద్ద కూడా అదే పరిస్థితి ఉంది. అక్కడ కూడా వాహనాల రద్దీని తగ్గించేలా నిర్మాణాలు చేపడుతున్నారు.జూలై 2023లో నార్సింగి ఇంటర్ ఛేంజ్‌ను ప్రారంభించారు. దీనిద్వారా ప్రయాణం సులభమైంది. వేలాది మంది ప్రయాణికులకు ఉపశమనం కలిగించింది. ఇది నార్సింగి, మంచిరేవుల, గండిపేట వంటి ప్రాంతాలను కలుపే కీలక జోన్‌గా మారింది. మరోవైపు విమానాశ్రయం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వంటి ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచి తొందరగా చేరుకోవచ్చు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు భారతదేశంలోని పొడవైన రింగ్ రోడ్లలో ఒకటి. ఇది 8 లేన్ల రహదారి. హైదరాబాద్ నగరం చుట్టూ 158 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రహదారి నిర్మాణానికి సుమారు రూ. 6,696 కోట్లు ఖర్చు అయింది. 2012 డిసెంబర్‌లో దీన్ని ప్రారంభించారు. ఇది నగర శివార్లలోని ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది.

## సరస్వతి పుష్కర పనులు వేగవంతంగా చేయాలి

జయశంకర్ భూపాలపల్లి: సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లుపై రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్, దేవాదాయ, విద్యుత్ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ 4, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ విభాగం 7, మిషన్ భగీరథ 15, దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం 28, విద్యుత్ 11 మొత్తం 65 పనులు పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఎన్నికల కోడ్ ముగియనున్నందున పనులు సత్వరమే చేపట్టేలా అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో జరిగే సరస్వతి పుష్కరాలు అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉన్నందున, అన్ని ఏర్పాట్లు ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పుష్కరాల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేశారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు క్రమబద్ధంగా పూర్తి చేయాలి అన్నారు. ముఖ్యంగా స్నానఘట్టాలు, రహదారులు, తాగునీటి సరఫరా, శానిటేషన్, విద్యుత్, భద్రత, పార్కింగ్ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పుష్కరాల నిర్వహణను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లుపై ఆయా శాఖల అధికారులు నిరాటంకంగా పర్యవేక్షణ చేయాలని, పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులకు సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పిఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ నిర్మల, విద్యుత్ శాఖ డీఈ పాపిరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా సరికొత్తగా విద్యా బోధన

- కొత్త టీచర్లకు ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం
- ఎస్జీటీలకు మూడు రోజుల్లో పూర్తయిన శిక్షణ
- నూతన విద్యా బోధనపై ట్రైనింగ్
- విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లవైపు మళ్లించేలా నూతన ఒరవడిలో బోధన
- కొత్త ఉత్సాహంతో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయులు



**వేద న్యూస్, వరంగల్:**

గత సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోంది. మొదటగా ఫిబ్రవరి 28 నుండి మార్చి 3 వరకు ఎస్జీటీ టీచర్లకు ఈ శిక్షణను ఏర్పాటు చేసి పూర్తి చేశారు. వరంగల్ జిల్లాకు సంబంధించిన శిక్షణను శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. మూడు రోజుల్లో తెలుగు, ఇంగ్లీషు, గణితం, పరిసరాల విజ్ఞానం అంశాల్లో నూతన ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలను నేర్పారు.

మార్చి 4, 5, 6 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని తర్వాత మార్చి 10, 11, 12 తేదీల్లో స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు శిక్షణ ఇస్తారు. సీనియర్ అధ్యాపకులను రిసోర్స్ పర్సన్స్‌గా ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీళ్లంతా కొత్త టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఎంపికైన టీచర్లను కూడా శిక్షణకు రప్పించారు. వీరి స్థానంలో తాత్కాలికంగా ఇతర ఉపాధ్యాయులను నియమించారు. శిక్షణ విధానంపై రాష్ట్ర పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు కొన్ని సూచనలు చేసింది. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లవైపు విద్యార్థులను మళ్లించేలా టీచర్లు తీసుకోవాల్సిన చొరవను సూచించింది.

ముఖ్యంగా ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ముందుకు తీసుకెళ్లేందుకు టీచర్లు నూతన బోధన విధానాలను ఆకళింపు చేసుకోవడంపై దృష్టి పెట్టాలని శిక్షణలో వివరించారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం కల్పించడం, స్కూళ్లల్లోని వసతులు, పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ సౌకర్యాల వివరాలను టీచర్లు జనంలోకి తీసుకెళ్లాలని సూచించారు. పాఠ్య ప్రణాళికలు నూతన పద్ధతుల్లో రూపొందించడం, మూల్యాంకన విధానంలో మార్పులు, డిజిటల్ విధానంలో బోధన, తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల నిర్వహణ, యూడైస్‌లో డేటా ఎంట్రీ పద్ధతులను కొత్త టీచర్లకు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ బోధనలో కీలక పాత్ర పోషించబోతోంది. కొత్త తరం టీచర్లు నిరంతర అధ్యయనం, టెక్నాలజీతో పోటీపడి నేర్చుకునే పద్ధతులు అనుసరించాల్సి ఉంది. ఈ కోణంలో శిక్షణ ఇస్తున్నట్టు విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

ఇప్పటికే అనేక పాఠశాలల్లో ఏఐ టెక్నాలజీ బోధనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని కన్నా ముందు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా మరిన్ని మెళకువలు నేర్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తయిన తర్వాత టీచర్లు ఏఐపై సమగ్ర అవగాహన సంపాదిస్తారని చెబుతున్నారు.

**నూతన పద్ధతులు**

ఈ శిక్షణలో విద్యార్థులకు అర్థవంతంగా బోధన చేయడానికి నూతన బోధనా పద్ధతులను నేర్పారు. బోధనలో సాంకేతికతను ఎలా వినియోగించాలి..? పరీక్షల నిర్వహణ ఎలా చేయాలి..? అభ్యసన కృత్యాలను ఎలా నిర్వహించాలి..? ఎఫ్ఎల్ఎన్ గురించిన సమగ్ర అవగాహనను ఉపాధ్యాయులకు వివరించారు.



ఈ శిక్షణలో చాలా విషయాలు నేర్చుకున్నాను. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. బోధనలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో డీఆర్పీలు మాకు చాలా చక్కగా వివరించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన మాకు ఈ ఇండక్షన్ ట్రైనింగ్ మాలో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఇక్కడ నేర్చుకున్న విషయాలను మా పాఠశాలల్లో అన్వయించి మంచి ఫలితాలు రాబట్టేలా కృషి చేస్తాము.

- వెలిదే దివ్య, ఎస్జీటీ టీచర్
ఎంపీయూపీఎస్ అడవి రంగాపూర్,
దుగ్గొండి మండలం



మూడు రోజుల్లో చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇక్కడ నేర్చుకున్న అంశాలు మా బోధనలో సరికొత్త మెలకువలకు దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. డీఆర్పీలు బోధన పట్ల సరికొత్త దృక్పాదాన్ని నేర్పారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి, బోధనలో నూతన పద్ధతులను అన్వయించడానికి ఈ ట్రైనింగ్ చాలా ఉపయోగపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా స్థాయి అధికారులకు, ఎస్సార్పీలకు, డీఆర్పీలకు ప్రత్యేక ధన్యవాదాలు.

- కాసం మనోజా రెడ్డి, ఎస్జీటీ టీచర్
ఎంపీయూపీఎస్ కొండాపూర్,
నల్లబెల్లి మండలం



ఈ మూడు రోజులు మాలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మారుతున్న విద్యా విధానంలో ప్రభుత్వ టీచర్లు అన్నీ విధాల పోటీ పడేలా ఈ శిక్షణ మాకు చాలా ఉప యుక్తంగా మారుతోంది. కొత్త సాంకేతికతను వినియోగించు కుని బోధనలో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో విద్యార్జన పట్ల ఆసక్తి కలిగించేలా చాలా విషయాలు మాకు నేర్పారు. ఎస్సార్పీల పర్యవేక్షణలో, డీఆర్పీలు చాలా ఓపికగా మాకు ఎన్నో అంశాల్లో శిక్షణ ఇచ్చారు. వారందరికీ థ్యాంక్స్..

- రాజన్‌బాబు కునమల్ల, ఎస్జీటీ టీచర్
ఎంపీపీఎస్ పంతులుపల్లి,
నల్లబెల్లి మండలం

# కుంభమేళలో 65 కోట్ల మంది

## ఎలా లెక్కించారంటే..




లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహా కుంభ్‌నగర్‌లో నిర్వహించిన మహా కుంభమేళా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా కుంభమేళాను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం.. చిన్న చిన్న ఆటంకాలు మినహా ఘనంగా పూర్తి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డు సృష్టించిన ఈ ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు 65 కోట్లకుపైగా మంది భక్తులు వచ్చినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ సంఖ్య.. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్, చైనాల తర్వాత ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు ఈ 65 కోట్లకుపైగా మంది భక్తులు.. ప్రయాగ్‌రాజ్ వచ్చారని.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఎలా లెక్కించింది అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. మహా కుంభమేళా నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను యూపీ ప్రభుత్వం విస్తృతంగా ఉపయోగించింది. 4 వేల ఎకరాల వైశాల్యంలో 2750 సీసీ కెమెరాలను 24 గంటలు పనిచేశాయి. వాటిలో 250 ఏఐ ఆధారిత కెమెరాలు ఉన్నాయి. ఇవన్నీ సమాచారాన్ని కమాండ్ సెంటర్ కు నిరంతరం అందించాయి. ఎంతమంది వస్తున్నారు,పార్కింగ్ స్థలంలో వాహనాలు సంఖ్య, కూడళ్లలో రద్దీ పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు.అయితే మహా కుంభమేళాకు భక్తులు వచ్చే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐతో కూడిన సీసీటీవీలతో నిఘా ఏర్పాటు చేశారు. వీటి వల్ల రోజువారీగా మహా కుంభమేళాకు ఎంత మంది భక్తులు వచ్చారు అనేది లెక్కించారు. కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్యను కచ్చితంగా లెక్కించడానికి ఏఐని ఉపయోగించినట్లు డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ వెల్లడించారు. అయితే ఈ ఏడాది జనవరి 13వ తేదీన ప్రారంభం అయిన మహా కుంభమేళా 45 రోజుల పాటు సాగి.. బుధవారం(ఫిబ్రవరి 26) మహా శివరాత్రి సందర్భంగా ముగిసింది. కానీ రద్దీగా గుంపులు గుంపులుగా ఉండే జనాన్ని లెక్కించేందుకు ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌ను ఉపయోగించడం ఏడాది ముందు నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. అయితే ఈ ఏఐ ద్వారా , జన సాంద్రతను అంచనా వేయడానికి 2024 మాఘ మేళా నుంచే వీడియో ఫుటేజ్‌పై ట్రైనింగ్ చేసినట్లు పేర్కొన్నారు.ఇక మొట్టమొదటిసారి అండర్ వాటర్ డ్రోన్లను అధికారులు.. ఈ మహా కుంభమేళాలో ఉపయోగించారు. గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఈ అండర్ వాటర్ డ్రోన్లు ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ ఏఐ కెమెరాలను మహా కుంభమేళా జరిగే మహా కుంభ్ నగర్ మొత్తం ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు రియల్ టైమ్ డేట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఆ కెమెరాలన్నింటిని ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా సెంట్రల్ సర్వర్లకు లింక్ చేశారు.ఈ క్రమంలోనే ఆ వీడియో ఫుటేజీని ప్రాసెస్ చేయడానికి రెండు ఏఐ మోడల్స్ కలిసి పనిచేశాయి. అందులో ఒకటి మొత్తంగా జనసాంద్రత ఎంత ఉందో అంచనా వేయడానికి.. మరో ఏఐ మోడల్.. గుంపులోని ప్రతీ ఒక్కరి కదలికలను ట్రాక్ చేయడానికి ఉపయోగించారు. ప్రత్యేకంగా రూపొందించిన అల్గారిథమ్ ద్వారా కెమెరాల్లో రికార్డ్ అయిన రా డేటాను ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సేకరించిన డేటాతో పోల్చి ప్రాసెస్ చేశారు. ఆ తర్వాత తుది సమాచారాన్ని ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాష్ బోర్డ్‌పై డిస్ ప్లే చేశారు.అయితే ఈ ఏఐ వ్యవస్థ రెండింటిపై ఆధారపడి భక్తులను లెక్కించింది. ప్రత్యేకమైన జోన్లను స్కాన్ చేసి.. ఒక్కో ఫ్రేమ్‌లో ఉన్న వ్యక్తుల సంఖ్యను విశ్లేషించి.. రియల్ టైమ్ క్రౌడ్ పరిమాణాన్ని అంచనా వేయడానికి వివిధ రకాల కెమెరాల నుంచి ఇన్‌పుట్‌లను తీసుకుని క్రౌడ్ డెన్సిటీ మ్యాప్‌లను సృష్టించింది. ఇక మరొకటి ఏంటంటే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద కెమెరాలను ఉపయోగించి ప్రతి వ్యక్తి గుర్తించడం. ఈ గణాంకాలను పోలీసులు, అధికారులు, నిపుణులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. తొక్కిసలాటలు, బారికేడ్లను దాటుకుని పోవడం, రద్దీని నియంత్రించడం, భద్రతా ఉల్లంఘనలను గుర్తించడం చేశారు.

# యూ ట్యూబ్ గ్రామం

## - 6000 మంది జనాభాకు 1100 చానెల్స్

రాయ్ పూర్ : ఆ ఊళ్లోకి వెళ్తే ప్రతీ వీధిలోనూ ఎవరో ఒకరు కెమెరాలు పెట్టుకుని లేదో ఫోన్లతో వీడియోలు షూట్ చేస్తూ.. కంటెంట్ క్రియేషన్ లో కనిప్తారు. ఏ ఇంట్లో చూసినా ఓ యూట్యూబ్ స్టూడియో ఉంటుంది. ఎడిటింగ్ రూమ్ ఉంటుంది. అదేమి పెద్ద ఊరు కాదు.. చిన్న గ్రామం. పేరు తులసి. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో ఉంటుంది. వారంతా సోషల్ మీడియాకు.. యూట్యూబ్ కు బానిసలు కాలేదు. ఉపాధిగా మార్చుకున్నారు. ప్రతి ఒక్క కుటుంబం యూట్యూబ్ తో భారీగా సంపాదిస్తూ ఆర్థికంగా స్థిరపడ్డారు. ఛత్తీస్ ఘడ్ అంటేనే వెనుకబడిన రాష్ట్రం. అలాంటి రాష్ట్రంలోని ఓ చిన్న గ్రామంలో యూట్యూబ్ విప్లవం రావడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఇద్దరు కుర్రాళ్లు మొత్తం మార్చేశారు. తలసి గ్రామం నుంచి ఇద్దరు కుర్రాళ్లు బాగా చదువుకున్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఛత్తీస్ ఘడ్ గురించి అందరికీ తెలిసేలా చేయడానికి ఓ యూట్యూబ్ చానల్ పెట్టారు. దాంట్లో కంటెంట్ ను తమ ఊళ్లోనే రూపొందించేవారు. అయితే ఆ వీడియోలు పాపులర్ అయ్యేవి. ఇదేదో బాగుందని ఇతర యువకులు కూడా యూట్యూబ్ పై దృష్టి పెట్టారు. కానీ అక్కడే క్రియేటివ్ గా ఆలోంచించారు. విభిన్న రంగాల్లో తమ కంటెంట్ ఉండాలని.. ఎవరికి వారు కొత్తగా ఆలోచించి యూట్యూబ్ చానళ్లు ప్రారంభించారు.మొదట యూట్యూబ్ చానళ్లు ప్రారంభించిన కుర్రాళ్లు.. తమకు మాత్రమే చానళ్లు ఉండాలని అనుకోలేదు. ఈ రంగంలో ఎంత మంది అయినా సంపాదించుకోవచ్చని అందర్నీ ప్రోత్సహించారు. కుర్రాళ్లందరికీ ట్రైనింగ్ ఇచ్చారు. ఒక్కొక్కరు తమ క్రియేటివిటీని చూపించి సక్సెస్ అవుతూంటే మహిళలు కూడా బయటకు వచ్చి.. వారు కూడా వీడియోలు చేయడం ప్రారంభించారు. మహిళల వీడియోలు కూడా పాపులర్ అయ్యేవి. దీంతో ఇప్పుడు అక్కడ ప్రతి ఇంట్లో యూట్యూబ్ నుంచి వచ్చే సిల్వర్, గోల్డెన్ మెమెంటోలు కనిపిస్తూ ఉంటాయి. ఈ చానల్స్ లోవీడియో లు తీసేవారెవరూ బయటకు పోరు. వీలైనంత వరకూ తమ గ్రామంలోనే కంటెంట్ క్రియేట్ చేస్తారు. ఈ విలేజ్ మంచి పురోగతి సాధిస్తూండటంతో ప్రభుత్వం కూడా ఓ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ను ఆ ఊళ్లో ఏర్పాటు చేసింది. కొత్తగా వచ్చే యువతరానికి శిక్షణ ఇస్తున్నారు. ఈ యూట్యూబ్ విప్లవం వల్ల ఉద్యోగాలు లేకుండా చెడుదారి పట్టే యువతకు ఇప్పుడు తీరిక లేకుండా క్రియేటివ్ గా ఉన్నారని.. చాలా వరకూ మెరుగుపడ్డారని సంతోషపడుతున్నారు. ఇప్పుడీ విలేజ్ దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది

# 8 మంది ప్రాణాలపై ఆశ లేనట్టేనా?



మహబూబ్ నగర్ : శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో పనులు నిర్వహిస్తుండగా గత శనివారం ఉదయం సొరంగం పైకప్పు కూలిపోయిన విషయం తెలిసిందే. ప్రమాదం సమయంలో యాభై మంది వరకు కార్మికులు అందులో పనిచేస్తుండగా.. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే, వారిలో గురుప్రీత్ సింగ్, సన్నీ సింగ్, మనోజ్ కుమార్, శ్రీనివాస్, సందీప్ సాహూ, అనుజ్ సాహూ, సంతోశ్ సాహూ, జక్తాజస్ అనే ఎనిమిది మంది టన్నెల్ లోనే చిక్కుకని పోయారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు ఆరు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ టీం, ర్యాట్ హోల్ మైనర్స్ చెప్తున్న దాని ప్రకారం.. టన్నెల్ చివరి భాగంలో పరిస్థితులు అత్యంత భయానకంగా ఉన్నాయి. ఎటు చూసినా మట్టి, బురద, శిథిలాలే తప్ప ఆ ఎనిమిది మంది జాడ కనిపించలేదు. పైకప్పు కూలిన ప్రాంతం నుంచి టన్నెల్ 500 మీటర్ల వరకు మట్టి, బురద నీటితో ఊబిలా మారింది. టన్నెల్ ఎత్తు 10.2 మీటర్లు కాగా.. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దాదాపు 9.2 మీటర్ల ఎత్తులో మట్టి దిబ్బలు ఉన్నాయి. ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మంది చనిపోయి టన్నెల్ మిషన్ చుట్టూ బురదలో కూరుకుపోయి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇదిలాఉంటే.. కూలిన ప్రాంతంలో శిథిలాలను, మట్టిని తొలగిస్తే పైనుంచి మరింత మట్టి కూలే ప్రమాదం ఉందని రెస్క్యూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి భయానకరంగా ఉంది. గంటకు కనీసం 5వేల నుంచి 10వేల లీటర్ల వరకు నీరు వస్తుండటంతో రెస్క్యూ చేపట్టడం అతిపెద్ద సవాలుగా మారింది. నీటిని పవర్ ఫుల్ మోటార్లతో తోడేస్తున్నా ఊబిలా మారిన బురదను తొలగించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ టన్నెల్ లోపల ఆక్సిజన్ కూడా అందడం లేదని, ఊపిరి తీసుకోవడమూ కష్టమవుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టన్నెల్ లో గల్లంతైన వారు ప్రాణాలతో బయటపడే ఛాన్స్ లేదని అంచనా వేస్తున్నారు. మరో వైపు టన్నెల్ ప్రమాదంపై ఃఖీూ ఓవరాక్షన్ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైరయ్యారు. శ్రీశైలం పవర్ ప్లాంట్ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు చనిపోతే బీఆర్ఎస్ నేతలు ఎందుకు పరామర్శించలేదని మంత్రి ప్రశ్నించారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది చనిపోతే.. కనీసం అక్కడకు కేసీఆర్ వెళ్లలేదని మంత్రి అన్నారు. మాసాయిపేటలో చిన్నారులు ప్రాణాలు కోల్పోతే కేసీఆర్ కనీసం అడుగు కదపలేదని చెప్పారు. ఇప్పుడు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నిపుణులతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. కూలిపోయిన మట్టిని త్వరగా త్వరగా తీసివేస్తాం. మూడు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తి అవుతుంది. రెండు మూడు నెలల్లో ఈ టన్నెల్ ప్రాజెక్టు పనులు ప్రారంభించి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కంప్లీట్ చేస్తాం. ఈ ఘటనకు ప్రధాన కారణం గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వమే. వాటర్ డివాటరింగ్ కు కనీసం విద్యుత్ ప్రొవైడ్ చేయలేని చేతకానితనం బీఆర్ఎస్ ప్రభుత్వానిది' అని మంత్రి ఫైరయ్యారు.హరీష్ రావు మీ సలహాలు మాకు అవసరం లేదు. మీ కన్నా పెద్ద నిపుణులు టన్నెల్ లో రెస్క్యూ ఆపరేషన్ లో పనిచేస్తున్నారు. తెలంగాణలో జేబులు నింపుకోవడానికి కేసీఆర్ ఇరిగేషన్ శాఖను నాశనం చేశారు. దేవాదుల సీతారాం ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు..? ఇవాళ బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి మాట్లాడిన మాటలన్నీ అబద్ధం. ఎస్ఎల్‌బీసీ గ్రావిటీ ద్వారా 30 టీఎంసీల వాటర్ వస్తుంటే కూడా పనులు వదిలిపెట్టి పోయారు. టన్నెల్ ఘటనపై అబద్ధపు మాటలు మాట్లాడటం నేను ఖండిస్తున్నా. ఇష్టం వచ్చినట్లు మాట్లాడడానికి హరీష్ రావుకు సిగ్గుండాలి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే లోపలికి అనుమతించకుండా నియంత పాలన చేశారు. 1.81 లక్ష కోట్లు ఖర్చుపెట్టి ప్రాజెక్టులన్ని నిరూపయోగంగా మారాయి. పూర్తిగా ఇరిగేషన్ ను నాశనం చేసిన ఘనత కేసీఆర్ దే. గతంలో శ్రీశైలం ఎడమ జల విద్యుత్ కేంద్రం దగ్గర ఇలాంటి ఘటన జరిగితే లోపలికి ఎవరిని అనుమతించలేదు. ఆరోజు ఆ ఘటనను చూడడానికి వెళుతున్న ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని మధ్యలోనే అరెస్టు చేశారు. కాళేశ్వరంలో ఆరుగురు చనిపోతే దానికి మీరు ఎవరు జవాబు చెప్పలేదు. పాలమూరు రంగారెడ్డిలో పంపు కూలి ఆరుగురు చనిపోతే కనీసం దీనిపై క్లారిటీ ఇవ్వలేదు. 25 మంది పిల్లలు కేసీఆర్ ఫామ్ దగ్గర చనిపోతే పట్టించుకున్న నాథుడే లేదు' అని మంత్రి చెప్పుకొచ్చారు.

# హాట్ హాట్ సీజన్ లో అందాల పోటీలు

హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీలు అంటే ప్రపంచంలోనే ఓ అరుదైన , అద్వితీయమైన వేడుక. వివిధ దేశాల నుంచి సుందరీమణులు పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి తెలంగాణలోని హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వడం అనే మాట వింటుంటేనే హైదరాబాద్ జోష్ పెంచుతుంది. ఒక్కసారి ప్రపంచం దేశాలన్ని హైదాబాద్ వైపు చూపుతిప్పుకునే ఆ రోజు అతి చేరువలోనే ఉంది. ఈ ఏడాది ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌లో చెయ్యాలని నిర్వాహకులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. దీంతో 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. చారిత్రక, వారసత్వ సంపదను ప్రపంచానికి చాటడానికి తెలంగాణకు ఇదొక గొప్ప అవకాశం కానుంది. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటేందుకు అరుదైన ఘట్టం కానుంది.ఈ ఏడాది అందాల పోటీలకు అనువైన ప్రదేశంగా తెలంగాణను ఎంచుకోవడం, అందులోనూ హైదరాబాద్ వంటి మహానగరం ఈ వేడుకులకు సిద్ధమవ్వడం ఈ ప్రభుత్వంలో జరిగే ఓ అద్వితీయం వేడుకగా చెప్పవచ్చు. ఈ ఏడాది మేనెలలో నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతోపాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కి పైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మిస్ వరల్డ్ అందాల పోటీల్లో పాల్గొనే దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలకబోతుంది. మే 7 నుంచి ఈ అందాల పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉంటుంది. ప్రస్తుత మిస్ వరల్డ్ తర్వాత అందాల సుందరి కిరీటాన్ని ఎవరు ధరిస్తారో గ్రాండ్ ఫినాలే రోజు తేలనుంది.గతంలో న్యూఢిల్లీ, ముంబైలో ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. 71వ ఎడిషన్ ముంబైలోనే జరిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. ఐటీ, ఫార్మాసూటికల్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణకు ఈ అవకాశం దక్కడం నిజంగా గర్వించదగ్గ విషయమే. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేసినట్లు సమాచారం. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానాలు పంపుతోంది. గొప్ప చేనేత వారసత్వం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, అరుదైన వంటకాలు, విభిన్నమైన కళా వారతస్వమున్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మెన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తాజాగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేసారు.మిస్ ఇండియా పోటీలు అంటేనే సుందరీమణుల అలరిస్తారు. అందులోనూ మిస్ వరల్డ్ పోటీలు అంటే ఇంక మాటల్లో చెప్పక్కర్లేదు. ఎంత ఆహ్లాదంగా ఉంటుంతో, అంతే స్థాయిలో వివిధ దేశాల యువతుల మధ్య గట్టిపోటీ కూడా సర్వసాధారణం. ఈ పోటీల వేదికగా హైదరాబాద్ బ్రాండ్ వాల్యూని మరింత పెంచడంతోపాటు, ప్రపందేశాల ప్రతినిధులను ఆకట్టుకునేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం.

# శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి

**పోలీస్ కమిషనర్ డాక్టర్. బి. అనురాధ - అధికారులకు సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా ఎల్లప్పుడూ అండగా ఉంటాం**

**పదవి విరమణ చేసిన పోలీసు అధికారులకు కమిషనర్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోల కార్యక్రమం**


**సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు**

సిద్దిపేట : మంజూర్ హుస్సేన్... సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్బి, స్పెషల్ బ్రాంచ్ సిద్దిపేట, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేయడం జరిగింది. డిపార్ట్మెంట్లో వరకు 42 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినారు.

యెల్లు కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్ఐ ఏఆర్ కానిస్టేబుల్,ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఏఆర్ఎస్ఐ అంచలంచలుగా పదవున్నతి పొందారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పనిచేయడం జరిగింది. ప్రస్తుతం సిఏఆర్ హెడ్ క్వార్టర్ సిద్దిపేటలో విధులు నిర్వహిస్తూ వరకు డిపార్ట్మెంట్లో 39 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసినారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను అభినందించి సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సర్వీస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేస్తు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ పత్రాలు అందచేశారు. సిద్దిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని తెలిపారు.



ఈ సమావేశంలో పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారుల విధి నిర్వహణలో ఎదురైయిన అనుభవాను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. పోలీసు రిటైర్ మెంట్ కేవలం తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదు, అని కొనియాడారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా, పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. అత్యవసరం అయినప్పుడు రిటైర్డ్ అయిన పోలీస్ అధికారుల సేవలు వినియోగించుకుంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ మల్లేశం గౌడ్, తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సిసి నితిన్ రెడ్డి, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తల్లికి వందనానికి నిధులు...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన పాత్ర పోషించిన వాటిలో సూపర్ సిక్స్ హామీలు ఒకటి. అందుకే దీనిపై ఈ బడ్జెట్‌లో ఎక్కువ ఫోకస్ పెట్టారు. ఈ సూపర్ సిక్స్ హామీల్లో ముఖ్యమైంది తల్లికి వందన పథకం. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకానికి మార్పులు చేర్పులు చేసి దీన్ని అమలు చేయనున్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ఈ పథకాన్ని అందించనున్నారు. మే నెలలో తొలి విడత నిధులు మంజూరు చేయనున్నారు. తల్లికి వందనం పథకానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం 9వేల నాలుగు వందల ఏడు కోట్ల రూపాయలను కేటాయించింది. 2024-25 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులకు ఈ నిధలను మేలో అందజేయనున్నారు. గతంలో ఇదే పథకం అమ్మ ఒడి పథకం పేరుతో అమలు అయ్యేది. అప్పుడు 12 వేల రూపాయలు ఇచ్చే వాళ్లు ఇప్పుడు దాన్ని 15000 వేలకు పెంచారు. గతంలో కుటుంబంలో ఎంతమంది చదువుకున్నా ఒక్కరికే పథకం అమలు చేసే వాళ్లు ఇప్పుడు కుటుంబంలో ఎంతమంది చదువుకుంటూ ఉంటే అందరికీ ఈ పథకం వర్తింపచేయనున్నారు. విద్యకు కేటాయింపులు పయ్యావుల మాటల్లోనే"గత ప్రభుత్వపు దుర్మార్గపు పాలనా కాలంలో రాష్ట్ర విద్యావ్యవస్థపై దృష్టి సారించకపోవడం, నిర్లక్ష్యం, తప్పుడు విధానాలు వలన, మన రాష్ట్రంలోని 2.43 లక్షల మంది విద్యార్థులు బడి మానివేయటంతో వారి భవిష్యత్ ప్రమాదంలో పడింది.. ఇలాంటి పరిస్థితులలో విద్యా వ్యవస్థను చక్కదిద్దే అత్యంత కఠినమైన బాధ్యతను మంత్రి నారా లోకేష్ తనపై వేసుకున్నారు.. 'నేటి బాలలే.. రేపటి పౌరులనే భావనతో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడం మొదలు పెట్టారు. రిజల్ట్ ఓరియెంటెడ్ ఎడ్యుకేషన్ పై దృష్టి సారించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి టెక్నాలజీ విషయాలను ప్రధాన పాఠ్యాంశాలుగా తీసుకురావడానికి ఆయన చేసిన ప్రయత్నాలతో మన పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీపడి రాణించడానికి సిద్ధమవుతున్నారు. "మీరు సంవత్సరానికి ప్రణాళిక వేస్తే, వరి నాటండి.. దశాబ్దానికి ప్రణాళిక వేస్తే, చెట్లు నాటండి.. జీవిత కాలానికి ప్రణాళిక వేస్తే, ప్రజలకు విద్యనేర్పండి అన్న చైనా సామెతను ప్రాతిపదికగా పిల్లలకు విద్య అందించడం తల్లిదండ్రులకు భారం కాకూడదని మా ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది. ఏ కారణం చేతనూ ఏ బిడ్డా విద్యకు దూరం కాకూడదని విశ్వసిస్తున్నాము. ప్రతి తల్లి తన పిల్లలను పాఠశాలకు పంపేలా ప్రోత్సహించే లక్ష్యంతో, మరో సూపర్ సిక్స్ హామీని అమలు వరిచే దిశగా 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభిస్తున్నాం. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం క్రింద 15,000 రూపాయల ఆర్థిక సహాయంను అందించనున్నాము. చదువుకునే ప్రతి విద్యార్థి తల్లికి ఈ పథకాన్ని అందించడానికి కేటాయింపులు జరుపుతున్నాం. ఈ పథకం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు వర్తిస్తుంది. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం ద్వారా 35.69 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. ఉపాధ్యాయులకు స్నేహపూర్వక వాతావరణంతో కూడిన విద్యా వ్యవస్థ కోసం మా ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్తును అందించాలని నిర్ణయించింది. ఇది స్థానిక సంస్థలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేగాక ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్యాశాఖకు 31,805 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఉన్నత విద్య...** భవిష్యత్ నవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేయడం, అందరికీ సమాన అవకాశాలను కల్పించడం కోసం బలమైన, సమ్మిళిత ఉన్నత విద్యావ్యవస్థ నిర్మించడానికి ప్రభుత్వం అంకితభావంతో ఉంది. ఈ కార్యక్రమం కింద మల్టీ డిసిప్లినరీ విద్య, వరిశోధన విశ్వ విద్యాలయాల స్థాపన, పాలిటెక్నిక్ విద్యలో క్రెడిట్ ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టడం, అధునాతన తరగతి గదులు, ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీలతో విద్యాలయాలను ఆధునీకరించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా మన విద్యార్థులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ 100 విశ్వవిద్యాలయాలలో మన రాష్ట్ర విశ్వ విద్యాలయాలను నిలవడమే మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. అందుకే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉన్నత విద్యాశాఖకు 2,506 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను అని పయ్యావుల తెలిపారు.



## ఎమ్మెల్యేను కలిసిన కాజీపేట సిఎస్ఐ చర్చి పెద్దలు

**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేట సిఎస్ఐ సెయింట్ జోన్ చర్చ్ పెద్దలు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని క్యాంప్ ఆఫీస్ లో మర్యాదపూర్వకంగా కలిసి సీఎస్ఏ చర్చ్ సంబంధించిన సమస్యలపై ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే చర్చి కి సంబంధించిన సమస్యలు తీరుస్తానని వారికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చ్ పాస్టర్ విక్టర్ పాల్, ట్రెజరర్ ధర్మరాజు, చర్చి ప్రాపర్టీ సెక్రటరీ యేసు రాజు, 47 వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు మైసరపు సిరి ల్ లారెన్స్, దొంగల కుమార్, బర్ల రాజ్ కుమార్, పాల్గొన్నారు.




## మడికొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

**వేద న్యూస్, మడికొండ :**

కాజీపేట పట్టణం, మడికొండ పోలీస్ స్టేషన్‌ను కాజీపేట ఏసిపి తిరుమల్ ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీట్స్, హిస్టరీ షీట్స్, సస్పెక్ట్స్ షీట్స్ లిస్టును తనిఖీ చేసి వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా రౌడీషీట్స్‌లో ఎవరైనా ఉంటే ప్రపోజల్స్ పంపించాలన్నారు. కమ్యూనిటీ పోలిసింగ్‌లో భాగంగా గ్రామాలలో సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ప్రజా పిర్యాదులో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, నేర దర్యా ప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారని మడికొండ సీఐ కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మడికొండ పోలీస్ స్టేషన్ ఎస్సై లు, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 56వ డివిజన్ మహిళ అధ్యక్షురాలుగా అనిత

**వేద న్యూస్, హన్మకొండ :**

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శనిగారపు అనిత నియమిస్తూ సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమిస్తూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు లకు శనిగారపు అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మహిళల అభ్యున్నతకు నిరంతరం పాటుపడతానని అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## విజేత డిగ్రీ పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడలోని విజేత డిగ్రీ మరియు పీజీ కళాశాల నందు న్యూ ల్యాండ్, ఎమ్మెస్ ఎన్ కంపెనీ ల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను సోమవారం నిర్వహించడం జరిగింది. మెగా జాబ్ మేళా ను కళాశాల ప్రిన్సిపల్ తెడ్ల ధనుంజయ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మా కళాశాలలో విద్యతోపాటు ఉపాధి నీ కూడా కల్పించేందుకు తమవంతు బాధ్యతగా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నామని అన్నారు. తమ కళాశాలలో గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నం అని, ప్రతి ఏటా పలు ప్రఖ్యాత పరిశ్రమల సౌజన్యంతో జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాలో ప్రాతినిథ్యం వహించిన సంస్థల ప్రతినిధులు మధుసూధన్, గణేష్ లు పాల్గొన్న అభ్యర్థుల కు వ్రాత పరీక్ష,ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న 28 మంది అభ్యర్థులలో పదకొండు మంది ఎంపికయ్యారు. ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది,పెద్ద సంఖ్యలో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీకి పాలాభిషేకం

**వేద న్యూస్, శాయంపేట :**



కేంద్ర ప్రభుత్వం మన వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయానికి అభివృద్ధికి అనుమతిస్తూ నిధులు మంజూరు చేయడం వల్ల భారతీయ జనతా పార్టీ శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ అభివృద్ధికి ఎప్పుడు కట్టుబడి ఉంటుందని దానికి నిదర్శనమే విమానాశ్రయానికి అభివృద్ధికి అనుమతులు ఇస్తూ 450 కోట్ల రూపాయలను మంజూరు చేయడమని, వరంగల్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు జరగడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ,అదేవిధంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, ఉపాధి కల్పన దొరుకుతుందని ,వ్యాపారాలు కూడా పెద్ద ఎత్తున వ్యాపారం కూడా జరుగుతుందని వారు అన్నారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ అధినేతగా దేశానికి ఏ ఏ రాష్ట్రాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయో వాటిని గుర్తించి రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తారని తెలంగాణ అభివృద్ధికి నరేంద్ర మోడీ ఎప్పుడు కట్టుబడి ఉన్నారని సబ్కా సాత్ సబ్కా వికాస్ అనే నినాదంతోనే కేంద్ర ప్రభుత్వం ఉన్నదని మామునూరు విమానాశ్రయానికి మంజూరు చేయడం చాలా హర్షించదగ్గ విషయమని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు భూతం తిరుపతి, కోమటి రాజశేఖర్ భూత అధ్యక్షులు కదారి చంద్రమౌళి, కన్నెబోయిన రమేష్,మునుకుంట్ల చంద్రమౌళి, పున్నం సాంబయ్య, బత్తుల రాజేష్,పైడిమల్ల సుధాకర్, ఎర్ర తిరుపతిరెడ్డి, కొంగరి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల కన్నీటి వలపోత పాటల సిడిని ఆవిష్కరించిన మంత్రి

**వేద న్యూస్, కమలాపూర్ :**



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు జరిగిన మలిదశ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొనేలా వారిలో చైతన్యం కలిగించి స్ఫూర్తి నింపిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కళాకారులది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడడానికి, ప్రజల నరనరాల్లో స్వరాష్ట్ర కాంక్ష బలంగా నాటుకు పోవడానికి ఉద్యమ కళాకారులే కారణం అన్నది అక్షర సత్యం. రాజకీయ నాయకుల ప్రసంగాలతోనో, ఉద్యోగుల ధర్నాతోనో మాత్రమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించలేదు ఉద్యమ కళాకారుల ఉద్యమ ఆటాపాటలతోనే ఉద్యమానికి ఊపు వచ్చిందనేది ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా వాస్తవరూపమైనది.

కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత కళాకారుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎన్నికైన తొలి తెలంగాణ ప్రభుత్వం కొంతమంది కళాకారులకు మాత్రమే కొలువులు అందించింది. అసలైన కళాకారులను గుర్తించడంలో కొంత విఫలం చెంది పూర్తిస్థాయిలో కళాకారులందరికి న్యాయం చేయలేకపోయింది. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిజమైన కళాకారులు అందరికీ న్యాయం చేస్తామని మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారం మా ఉద్యమ నిరుద్యోగ కళాకారులను గుర్తించి ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకులు నేర్నాల కిషోర్ సారధ్యంలో పబ్బు సతీష్ నేతృత్వంలో కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన కళాకారుడు, బడిబాట రచయిత బందారి సుధాకర్ రచించి పాడిన 'ఉద్యమ నిరుద్యోగ కళాకారుల కన్నీటి వలపోత' పాటల ఆడియో సిడిని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేత ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళాకారులు బెజ్జంకి సదాచారి, ముత్యాల అనిల్, పిట్టల భవాని తదితరులు పాల్గొన్నారు.

# మిస్టరీ హత్య కేసును చేధించిన పోలీస్ అధికారులకు నగదు పురస్కారం

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




గత రెండు సంవత్సరాలు మిస్టరీగా మిగిలిపోయిన కేసును చేధించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచన పరకాల ఏసిపి సతీష్‌బాబుతో పాటు శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ రంజిత్‌లను వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందిస్తూ నగదు పురస్కారాలను అందజేశారు. వివరాల్లోకి వెళితే రెండు సంవత్సరాల క్రితం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో జరిగిన ఓ వృద్ధురాలి హత్యకేసులో నిందితులు పట్టుకొవడంలో ఎలాంటి క్లూస్ పరకాల పోలీసులకు లభించకపోవడంతో పాటు పరకాల పోలీస్ స్టేషన్ పలువురు ఇన్స్‌స్పెక్టర్లు పలుమార్లు బదిలీ కావడంతో ఈ కేసు ఓ మిస్టరీగా నిలిచిపోవడం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును శాయంపేట సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ రంజిత్ అప్పగించడం జరిగింది. దీనితో పరకాల ఏసిపి పర్యవేక్షణలో ఈ హత్య కేసు దర్యాప్తు చేపట్టిన రంజిత్ కొద్ది రోజుల్లోనే హత్యకు గురైంది శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామస్తురాలిగా గుర్తించడంతో పాటు బంగారు అభరణాల కోసం అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి హత్య గురైన వృద్ధురాలిని తీసుకవెళ్ళి ధర్మారం గ్రామ శివారులో దారుణంగా హత్య చేసినట్లుగా సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ దర్యాప్తులో బయట పటడంతో వృద్ధురాలని హత్య చేసిన రాజిరెడ్డిని గత నెలలో పరకాల పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్ తరలించారు. ఎంతో కాలంగా పెండిగ్‌లో వుంది పోలీసులకు ఓ సవాలుగా నిలిచిన ఈహత్యకేసును ఛేదించడంలో ప్రతిభ కబరిచిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ నగదు పురస్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమములో డిసిపి రవీందర్ పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన చందనాల చిరంజీవి-కోమల దంపతుల కుమార్తె అయినటువంటి దీక్షిత వివాహానికి కమలాపూర్ పద్మశాలి సంఘం తరఫున 11 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి సంఘం అంటే ఏదో పేరుకు ఉన్నదా అంటే ఉన్నది అన్నట్లుగా కాకుండా దానికి విభిన్నమైన రీతిలో సభ్యుల యొక్క కష్టసుఖాల్లో సంఘం పాలుపంచుకుంటుందని నిరూపించింది కమలాపూర్ పద్మశాలి సంఘం. ఆదివారం రోజున జరిగిన ఈ వివాహానికి పద్మశాలి కుల సంఘ పెద్దలు పోపా (పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ) రాష్ట్ర అధ్యక్షులు సామంతుల శ్రీనివాస్ చేతుల మీదుగా పెళ్లికూతురు తల్లిదండ్రులకు ఈ 11 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘం అంటే సంఘ సభ్యుల యొక్క ఎదుగుదలకు, అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా నడుచుకోవాలని, సభ్యుల యొక్క కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఏదైనా కష్టం వస్తే మన వెనకాల సంఘం ఉంటుంది అనే భరోసా కల్పించినప్పుడే ఆ సంఘానికి మంచి పేరు గుర్తింపు దక్కుతుందని ఆ తీరుగానే కమలాపూర్ పద్మశాలి సంఘం పయనించడం నిజంగా అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. పద్మశాలి పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, వావిలాల మురళి, కుమార్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, సురేష్, పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ కు అర్హత సాధించిన పోగుల అక్షయ

**వేద న్యూస్, నర్సంపేట :**



నర్సంపేట మండలంలోని మహేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ కి మహేశ్వరం గ్రామ విద్యార్థిని పోగుల అక్షయ అర్హత సాధించారు. ఎనిమిదో తరగతికి చెందిన పోగుల అక్షయ స్కాలర్ షిప్ కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం స్వరూప తెలిపారు. దీని ద్వారా విద్యార్థికి ఆర్థికంగా లబ్ది జరగనుంది. తొమ్మిదో తరగతి నుండి ఇంటర్ పూర్తి అయ్యే వరకు ప్రతీ ఏటా రూ.12వేలు నగదును ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోగుల అక్షయని హెచ్ఎం స్వరూప,ఉపాధ్యాయ బృందం అభినందించారు. మిగతా విద్యార్థులు అక్షయని స్ఫూర్తిగా తీసుకుని స్కాలర్ షిప్ లు సాధించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు అర్జున్ సాగర్, వేణు బాబు, శ్రీలత, రాజేశ్వరి, రమేష్, రేఖ, శ్రీలత, కరుణాకర్ పాల్గొన్నారు.

### మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది

**మొదటి పేజీ తరువాయి :** కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ, జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం దేశంలో మరే ప్రభుత్వం చేయలేదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాబోయే రోజుల్లో సమస్యలపై ఫెడరేషన్ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, కార్యదర్శి కొలుపుల వివేకానంద, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు భాస్కర్, నాయకులు నరేష్, రమేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, గీసుకొండ**



గీసుకొండలో అనారోగ్యంతో స్వర్గస్తులైన యాదగిరి రాజు అంత్యక్రియల ఖర్చుల సహాయార్థం, మన గీసుకొండ గ్రామ శ్రీమంతుడు పెగళ్ళపాటి లక్ష్మీనారాయణ సార్ పంపిన రూ 5వేలు, ఎన్నారై సైంటిస్ట్ డా.పసునూటి కళ్యాణ్ పంపిన రూ. 5వేలు ఆర్థికసహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈకార్యక్ర మంలో కర్ణకంటి రాంమూర్తి, ముల్క సత్యనారాయణ, బోడకుంట్ల ప్రభాకర్, మహ్మద్ సోనీ, పొగాకు కుమారస్వామి, జోజుల రాఘవేందర్, యాదగిరి కుమారస్వామి, లక్ష్మణ్ గురుస్వా మి, కోతి శివరాజ్, పసుల శివన్నారాయణ పాల్గొన్నారు.

## ఏకే ఫౌండేషన్ జాబ్ మేళాకి విశేష స్పందన

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా పట్టణంలో శ్లోక స్కూల్ లో ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కి సాగర్ నియోజకవర్గం, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ ప్రాంత నిరుద్యోగ యువతి యువకులు పాల్గొన్నారు. క్వస్ క్రాప్, ఫోక్సకాన్ కంపెని ప్రతినిధులు అభ్యర్థులకి కంపెనీ ప్రొఫైల్, జాబ్ ప్రొఫైల్ గురించి వివరించి ఇంటర్వ్యూస్ నిర్వహించారు. ఎంపిక అయిన 50 మంది అభ్యర్థులకి ఏ కే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త కట్టెబోయిన అనిల్ కుమార్ నియామాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉపాధి కల్పన ద్వారనే సామాజిక వికాసం,అభివృద్ధి జరుగుతుంది కావున ప్రతి నిరుద్యోగ యువత నైపుణ్యాలు మెరుగుపరుచుకొని అవకాశాలు అందిపుచ్చుకోవాలని యువత అభివృద్ధికి ఏ కే ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సునీల్ రావు, రాధిక, రాజిరెడ్డి, శ్లోక స్కూల్ అధ్యాపకుడు రాజేష్, తిమ్మాపురం మాజీ ఉప సర్పంచ్ తుమ్మరగోటి రమేష్ ,ఫౌండేషన్ సభ్యులు మన్నెం కోటి, మోకారాల అనిల్, మేకల మహేష్ యాదవ్, శేఖర్ గౌడ్, రావుల రాము, మోహన్ చారి, అంజి, చరణ్, యువత పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073